సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 7 । డిసెంబర్ । 2024



పదిలమేనా ?
పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధన కష్టంగా కనిపిస్తోంది. నూరు రోజుల కార్యాచరణను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. 10లో ▸



బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక
అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో పాల్గొనే ఆదికవి నన్నయ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ మహిళల జట్టును ఏలూరులో ఎంపిక చేశారు. 10లో ▸



నిలిచిన వంతెన పనులు
గోదావరి కాల్వపై వారధి నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నీటి ప్రవాహానికి ఆటంకాలపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 10లో ▸

న్యూస్‌రీల్

స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్



నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన అంబేడ్కర్ ఆశయాలు, త్యాగాలు ఆదర్శనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడవడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఇన్‌చార్జ్ డీఆర్వో బి.శివ నారాయణ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి కృషి



హోంగార్డులకు ప్రతిభా అవార్డులు అందిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: జిల్లాలో హోంగార్డుల సంక్షేమానికి కృషిచేస్తున్నామని రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో హోమ్‌గార్డ్స్ ఆర్గనైజేషన్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ, ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పోలీసు శాఖకు వెన్నెముకలా నిలిచి ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. జిల్లాలో 404 మంది హోంగార్డులు పనిచేస్తున్నారని చెప్పారు. కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీలో వీరికి రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు. హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో 12 మంది హోంగార్డులు పదవీ విరమణ చెందగా, ఏడుగురు మరణించారని చెప్పారు. వారికి ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా రూపంలో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఇద్దరికి అందజేశామన్నారు. పదవీ విరమణ పొందిన హోంగార్డులకు స్వచ్ఛందంగా ఇచ్చిన హోంగార్డుల ఒక రోజు వేతనం మొత్తం రూ.26,96,580లు అందజేశామన్నారు. అలాగే మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.32,52,510 అందించామని చెప్పారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కవాతులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్ర రావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఎస్బీ సీఐలు మల్లేశ్వరరావు, బోనం ఆదిప్రసాద్, డీటీసీ డీఎస్పీ సీహెచ్ ప్రసాదరావు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో మినీ బైపాస్ నిర్మాణం



నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో గరుడాళ్వార్ సెంటర్ నుంచి సొసైటీ సూపర్‌బజార్ వరకు మినీ బైపాస్ రహదారి నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దాదాపు రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టగా గరుడాళ్వార్ విగ్రహ కూడలి నుంచి పనులను ప్రారంభించారు. పొక్లయిన్‌తో ధ్వంసమైన పాత సీసీ రోడ్డును తొలగిస్తున్నారు. క్షేత్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్సై టి.సుధీర్ చర్యలు చేపట్టారు. భీమడోలు వైపు నుంచి కామవరపుకోట వైపునకు వాహనాలు గరుడాళ్వార్ సెంటర్ సమీపంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు (వెంకటకృష్ణాపురం) వైపు నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా వెళ్లాలని సూచించారు. శ్రీవారి కొండపైకి వెళ్లేవారు ఎప్పటిలా గరుడాళ్వార్ సెంటర్ నుంచి వెళ్లవచ్చన్నారు. స్వామివారి దర్శనార్థం బస్సుల ద్వారా వచ్చే భక్తులు గరుడాళ్వార్ సెంటర్‌లో దిగి ఆలయానికి వెళ్లాలన్నారు. రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వన్‌వే నిబంధనలు అమలవుతాయన్నారు. సిబ్బందితో కలిసి ఆయన పర్యవేక్షించారు.

రక్త దాత.. జీవన ప్రదాత

స్వచ్ఛంద రక్తదానంలో ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతినెలా రెండు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో శిబిరాల నిర్వహణకు కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ సీహెచ్ నాగరాణి ఆదేశాలిచ్చారు. నెలకు రెండు శిబిరాల చొప్పున ఏడాది కాలానికి షెడ్యూల్‌ను ఖరారు చేశారు.

రక్తదానం.. మహోన్నతం
- ప్రభుత్వ ఉద్యోగుల స్వచ్ఛంద రక్తదానం
- రెడ్‌క్రాస్ వినూత్న కార్యక్రమం
- ప్రభుత్వ శాఖల వారీగా శిబిరాల నిర్వహణ
- నెలకు రెండు విభాగాల చొప్పున షెడ్యూల్
- తొలిగా కలెక్టరేట్‌లో శిబిరం
- రాష్ట్రంలోనే తొలిసారిగా కార్యక్రమం



భీమవరం కలెక్టరేట్‌లో శిబిరంలో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు



సాక్షి, భీమవరం: వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ లెక్కల ప్రకారం.. ప్రజల రక్తం అవసరాలు తీర్చేందుకు మొత్తం జనాభాలో సగటున 1.25 శాతం రక్త యూనిట్లు (ఒక్కో యూనిట్ 450 ఎంఎల్) అందుబాటులో ఉండాల్సి ఉండగా 0.5 శాతం కొరత ఉంటోంది. రక్తదాన శిబిరాల ద్వారా ఈ కొరతను అధిగమించాలి. నూతన పశ్చిమగోదావరి జిల్లా జనాభా దాదాపు 20 లక్షలు కాగా 25 వేల యూనిట్ల రక్తం, రక్త భాగాలు అవసరమవుతాయి. జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మూడు, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏడు వరకు బ్లడ్ బ్యాంకులు ఉన్నా ఇంకా రక్తం కొరత ఎక్కువగా ఉన్నట్టు జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ గుర్తించింది. సమస్యను అధిగమించి అవసరమైన లభ్యత ఉంచేందుకు కలెక్టర్ నాగరాణి ప్రత్యేక చొరవ చూపారు. రక్తదాన శిబిరాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాలుపంచుకునేలా ఆదేశాలిచ్చారు. ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారాల్లో శిబిరాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు. ఏ నెలలో ఏయే శాఖల ఉద్యోగులు శిబిరాల్లో పాల్గొనాలో తెలియజేస్తూ వచ్చే నవంబరు వరకు ఏడాది కాలానికి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఆయా రోజుల్లో సంబంధిత శాఖల అధికారులు తమ విభాగాల ఉద్యోగులు, ప్రజల భాగస్వామ్యంతో శిబిరాలు నిర్వహించాల్సి ఉంది.

రెగ్యులర్ శిబిరాలతో ఎంతో మేలు

సాధారణంగా రక్తంలోని ప్లాస్మా 365 రోజులు నిల్వ ఉంటే, తరచుగా వినియోగించే హోల్ బ్లడ్, ఎర్ర రక్త కణాలు 35 రోజులు, ప్లేట్‌లెట్లు నాలుగు రోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. రెండు మూడు నెలలకోసారి మెగా శిబిరాలు నిర్వహించి భారీ ఎత్తున సేకరించిన రక్తం ఒక్కోసారి వినియోగం కాకుంటే నిర్ణీత రోజులు గడిచాక వృథాగా పోతుంది. అయితే ప్రతి నెలా క్రమం తప్పకుండా పదిహేను రోజులకోసారి రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేయడం ఎంతో ప్రయోజనకరమని రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు అంటున్నారు. రక్తం పాడవ్వడానికి ఆస్కారం తక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

కలెక్టరేట్‌లో ప్రారంభం

మొదటి రక్తదాన శిబిరాన్ని భీమవరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. భీమవరంలోని రెడ్‌క్రాస్ కాంపోనెంట్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.శివరామ భద్రిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో ప్రతినెలా శిబిరాల నిర్వహణకు కార్యాచరణ చేయడం రాష్ట్రంలో ఇదే మొదటిసారని తెలిపారు. దీనివల్ల రక్తం కొరత సమస్య పరిష్కారమై ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు వీలుంటుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన జిల్లాల్లోనూ కలెక్టర్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలుచేసే దిశగా వివిధ జిల్లాల రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీలు ముందుకు వస్తున్నాయన్నారు.

రక్తం కొరతను అధిగమించేందుకు..



రక్తం కొరతను తీర్చడం, అత్యవసర పరిస్థితులు, శస్త్రచికిత్సల సమయంలో ప్రజల ప్రాణాలను రక్షించి సహాయాన్ని అందించడం లక్ష్యంగా ప్రభుత్వ ఉద్యోగులతో ఈ ప్రత్యేక కార్యాచరణ చేశాం. ఇది ఎంతో మంచి పరిణామం. రక్తం ఇవ్వడం వల్ల లాభమే గానీ ఏ విధమైన నష్టం లేదు. నేను ఎన్నోసార్లు రక్తదానం చేశాను. సమాజ శ్రేయస్సు కోరి రక్తదానం చేయడానికి అందరూ ముందుకు రావాలి.

– సీహెచ్ నాగరాణి, కలెక్టర్

రక్తదాన శిబిరాల నిర్వహణ

ప్రభుత్వ శాఖలు	తేదీ
ఆర్డీఓ, మున్సిపల్ కార్యాలయం, భీమవరం	డిసెంబరు 20
ఆర్డీఓ, మున్సిపల్ కార్యాలయం, నరసాపురం	జనవరి 3
ఆర్డీఓ, మున్సిపల్ కార్యాలయం, తాడేపల్లిగూడెం	జనవరి 17
జిల్లా విద్యాశాఖ	ఫిబ్రవరి 7
పీడీ, డ్వామా	ఫిబ్రవరి 21
పీడీ, డీఆర్‌డీఏ	మార్చి 7
పీడీ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్	మార్చి 21
జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఇంజనీరింగ్ అధికారులు	ఏప్రిల్ 4
జిల్లా పంచాయతీరాజ్ శాఖ	ఏప్రిల్ 17
అసిస్టెంట్ కమిషనర్, లేబర్	మే 9
జిల్లా హౌసింగ్ శాఖ	మే 23
డీఎల్‌డీఓ, భీమవరం	జూన్ 6
జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్	జూన్ 20
జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్	జూలై 4
జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్	జూలై 18
జిల్లా హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ ఆఫీసర్	ఆగస్టు 7
జిల్లా హార్టీకల్చర్ ఆఫీసర్	ఆగస్టు 22
జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసర్	సెప్టెంబరు 12
జిల్లా వ్యవసాయ శాఖ ఆఫీసర్	సెప్టెంబరు 26
చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్	అక్టోబరు 10
సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్	అక్టోబరు 23
జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్	నవంబర్ 7
జిల్లా ట్రెజరీ ఆఫీసర్	నవంబర్ 21

బెల్టు షాపులపై దాడులు



నిర్వాహకుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సీఐ

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'ఊరంతా బెల్టు షాపులే' శీర్షికతో 'సాక్షి'లో శుక్రవారం వచ్చిన కథనానికి తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు స్పందించారు. తణుకు పాతవూరులో దాడులు నిర్వహించి మొబైల్ అమ్మకాలు చేస్తున్న బెల్టు షాపు నిర్వాహకుడు మల్లాడి లక్ష్మీనారాయణను అరెస్టు చేసి అతని నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. పట్టణంలో పాటు పాతవూరు ప్రాంతంలో ప్రత్యేక దాడులు చేశామన్నారు. దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పుల సవరణకు అవకాశం

భీమవరం: ప్రస్తుత విద్యాసంవత్సరంలో టెన్త్, ఇంటర్ విద్యార్థుల వివరాల్లో తప్పులు ఉంటే ఈనెల 10వ తేదీలోపు సవరించుకోవాలని డీఈఓ ఈ.నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఆధార్ నంబర్, పేరు, ఫొటో, సంతకం, తల్లిదండ్రుల పేర్లు వంటి వాటిలో తప్పులు ఉంటే ఏఐ కో–ఆర్డినేటర్ వద్ద సవరించుకునే అవకాశం ఉందన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు

నరసాపురం: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లి టాక్సీస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ప్రభుత్వాలు అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడంలో శ్రద్ధ చూపాలన్నారు. మాజీ సీఎం జగన్ విజయవాడలో దేశంలో ఎక్కడాలేని విధంగా అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని స్ఫూర్తిదాయకంగా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందంటే అందులో అంబేడ్కర్ కృషి దాగి ఉందన్నారు. పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడు అన్నారు. నరసాపురం షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిర్రే బాబూరావు మాట్లాడుతూ అంబేడ్కర్ కలలు కన్న సమాజం కోసం అందరూ కృషిచేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర నేత పెంర్ర వీరన్న, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీలు గుబ్బల రాధాకృష్ణ, తిరుమాని బాబపూజీ, ఇంజేటి జాన్ కెనడీ, బందన పూర్ణచంద్రరావు, పప్పుల రామారావు, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్, సీహెచ్ రెడ్డప్పధవేజీ, కొల్లాబత్తుల రవి, నక్కా లక్ష్మీనారాయణ, ఇంజేటి రవీంద్ర, చల్లా సత్యనారాయణ, తెన్నేటి గిరి, పాలపర్తి బోస్, కడలి రాంబాబు, దీపాటి జానకీరాజు, అడిదల శరత్, కాకిలేటి ఆనంద్, నిప్పులేటి సత్యనారాయణ, కౌన్సిలర్లు సిర్రా కాంతమ్మ, జిల్లెళ్ల దిలీప్ పాల్గొన్నారు.



నరసాపురం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు



భీమవరం: విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ మోషేనురాజు



తణుకు అర్బన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక

సమానత్వాన్ని నెలకొల్పిన మహనీయులు

తణుకు అర్బన్: సమాజంలో అందరూ సమానమేననే నినాదంతో ప్రపంచాన్ని మేల్కొలిపిన మహనీయులు అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాలకు అండగా నిలవడంతో పాటు రాజ్యాంగం ద్వారా అందరికీ హక్కులు కల్పించిన మహనేత అంబేడ్కర్ అని అన్నారు. దేశంలో అంటరానితనాన్ని పోగొట్టి సమానత్వానికి బాటలు వేసిన విజ్ఞానశీలి అంబేడ్కర్ అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆయన్ను నిరంతం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు ఉండవల్లి జానకి, నత్తా కృష్ణవేణి, నాయకులు మల్లిరెడ్డి నాగార్జున, పొట్ల సురేష్, షేక్ ఫహీమా, మారిశెట్టి శేషగిరి, కరిబండి రాజేష్, నిమ్మల సురేష్, డీజే అమూల్యారావు, జల్లూరి జగదీష్, గెద్దా శ్రీకాంత్, గంజి సతీష్ పాల్గొన్నారు.

భీమవరంలో మోషేనురాజు నివాళులు

భీమవరం: బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు నివాళులర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● వైభవం.. సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



కల్యాణ తంతు జరిపిస్తున్న దృశ్యం



హాజరైన మాజీ మంత్రి కారుమూరి, భక్తులు

అత్తిలిలో షష్ఠి వేడుకల్లో భాగంగా వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. అత్తిలికి చెందిన కూనపరెడ్డి తేజ, విజయలక్ష్మి దంపతులచే కల్యాణం నిర్వహించారు. అర్చకులు ఐలూరి శ్రీరామం, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కల్యాణ తంతు జరిగింది. స్వామివారికి సమర్పించిన తలంబ్రాలను మహిళలు కొంగుల్లో పట్టుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పరిసరాలు కాంతులీనుతున్నాయి. – అత్తిలి

ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలి

కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): పేదల ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని నెలాఖరు నాటికి నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఇళ్ల నిర్మాణాలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాకు కేటాయించిన 3,159 నిర్మాణాల లక్ష్యంలో 1,737 మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన 1,422 ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మండలాల వారీగా లక్ష్యం, సాధనపై సమీక్షించి వెనుకబడిన మండలాల అధికారులను మందలించారు. హౌసింగ్ డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ లబ్ధిదారులను ప్రోత్సహించి గృహ నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. వివిధ పనుల నిమిత్తం ఉదయమే బయటకు వెళ్లే మహిళా లబ్ధిదారులు ఉంటారని, వారు బయటకు వెళ్లే సమయానికి కంటే ముందుగానే వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. భీమవరం అర్బన్‌లో 193 ఇళ్ల లక్ష్యానికి 31 ఇళ్లు మాత్రమే పూర్తికావడంపై సంబంధిత ఏఈపై అసహనం వ్యక్తం చేశారు. శ్లాబ్ పూర్తయిన ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రానున్న పది రోజుల్లో 90 శాతాన్ని, నెలాఖరు నాటికి నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల బిగింపు

సాక్షి స్పందన

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం గ్రామంలో ఇటీవల దళితుల ఇళ్లల్లో విద్యుత్ అధికారులు తొలగించిన విద్యుత్ మీటర్లను శుక్రవారం ఉదయం తిరిగి బిగించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వాడుకునే జీఓ గత ప్రభుత్వం అమలు చేయగా కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించాలంటూ విద్యుత్ మీటర్లు తొలగించింది. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురించగా అధికారులు స్పందించారు. తొలగించిన మీటర్లను తిరిగి మరలా బిగించారు. అయితే తాము తొలగించలేదని 'సాక్షి' అసత్య ప్రచారాలు చేస్తుందంటూ చెప్పాలని దళితులను అధికారులు కోరగా.. దళితులు నిరాకరించారు. ఇక చేసేదిలేక అధికారులు మీటర్లు బిగించి వెళ్లిపోయారని బాధితులు అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్రు మాల్యాద్రి, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, బాధితులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



రెడ్డిగణపవరంలో తొలగించిన స్థానంలో తిరిగి మీటర్లను బిగించిన దృశ్యం

కథోలిక న్యాయవాదుల సదస్సు

పెదవేగి: వృత్తిరీత్యా కథోలిక న్యాయవాదులు మరింత అవగాహన పెంచుకోవాలని ఆర్సీఎం ఏలూరు పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠ పాలనాధికారి పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో శుక్రవారం రాత్రి కథోలిక న్యాయవాదుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. విజయవాడ పీఠాధిపతి తెలగతోటి రాజారావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెండు రోజులపాటు సదస్సు జరుగుతుందని పీఆర్వో ఫాదర్ టి.ఇమ్మానియేల్, నిర్వహణ బృంద సభ్యులు ఫాదర్ బాల, ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ ఇన్ జయపాల్, ఫాదర్ పి.జాకబ్, ఫాదర్ బాబు జార్జ్ పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న బిషప్ జయరావు

క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయాలకు కూటమి తూట్లు



వల్లూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న ఆనందప్రకాష్

పెనుగొండ : పేదల సంక్షేమాన్ని మరిచి, దళితులకు అన్యాయం చేస్తూ కూటమి ప్రభుత్వం బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తుందని ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్ విమర్శించారు. వల్లూరు చింతపర్తివారి పాలెంలో మాజీ సర్పంచ్ నీతిపూడి భాగ్యలక్ష్మీ వెంకట్రావు దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల అమలుపై కూటమి దోబూచులాడుతుందన్నారు. ఎన్నో హామీలు, ఆశలు పెడుతూ పేదలను మభ్యపెట్టిందన్నారు. పేదల అభ్యున్నతికి అంబేడ్కర్ మార్గ నిర్దేశం చేశారన్నారు. వాటికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడించిదన్నారు. రాష్ట్రంలో దళితులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చింతపర్తి మాధవరావు, చింతపర్తి రాజు, చదలవాడ యేసు, ఖండవల్లి ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక ప్యాకేజీ

ఏలూరు (టూటౌన్): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జనవరి 19 నుంచి 26 వరకు మహాకుంభ మేళా పుణ్య క్షేత్ర యాత్రను నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఏరియా మేనేజర్ ఏ.రాజా ఒక ప్రకటనలో తెలియజేసారు. వారణాసి, అయోధ్య, ప్రయాగ్ రాజ్ పుణ్యక్షేత్రాలను దర్శించవచ్చునన్నారు. జనవరి 19 నుంచి 26 వరకు ఏడు రాత్రులు, ఎనిమిది రోజులు ఈ యాత్ర సాగుతుందన్నారు. జనవరి 19న సికింద్రాబాద్‌లో ప్రారంభమయ్యే రైలు విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని స్టేషన్లలో ఆగుతుందన్నారు. టిక్కెట్ ధర పెద్దలకు స్లీపర్ క్లాస్ రూ.22,635, థర్డ్ ఏసీ రూ.31,145, సెకండ్ ఏసీ రూ.38,195 పిల్లలకు స్లీపర్ క్లాస్ టిక్కెట్ రూ.21,740, థర్డ్ ఏసీ రూ.30,095, సెకండ్ ఏసీ రూ.36,935గా నిర్ణయించామన్నారు. టీ, అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం అందిస్తారన్నారు. పూర్తి వివరాలకు ఐఆర్‌సీటీసీ విజయవాడ నంబర్లు 9281495848, 8977314121 లో సంప్రదించాలన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామానికి చెందిన కొసనం దివ్యకు 2019లో వివాహమైంది. టి.నరసాపురం మండలం బండివారిగూడెంకు చెందిన నల్లకాసుల లీలా కృష్ణకు, దివ్యకు 2022లో జంగారెడ్డిగూడెం బస్టాండ్‌లో పరిచయం ఏర్పడింది. లీలా కృష్ణ ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని దివ్యను నమ్మించాడని, ఈ క్రమంలో దివ్య భర్త నుంచి విడాకులు తీసుకుని, లీలా కృష్ణను పెళ్లి చేసుకోవాలని కోరిందన్నారు. పెళ్లి చేసుకోవడానికి లీలాకృష్ణ నిరాకరించాడని, దీంతో తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ లీలాకృష్ణపై దివ్య ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈసారైనా పదిలమేనా ?

- పది ఫలితాల్లో పురోగతి సాధ్యమేనా?
- నూరు రోజుల ప్రణాళికపై ఉపాధ్యాయుల అసంతృప్తి
- ఇంకా పూర్తి కాని సిలబస్
- ఇంతవరకూ అందని విజయకేతనం బుక్‌లెట్



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : పదో తరగతి పరీక్షలు దగ్గరకు వచ్చేస్తున్నాయి. మార్చి లేదా ఏప్రిల్‌లో పరీక్షలు జరిగే అవకాశముందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యం ఉన్నా.. లక్ష్యాన్ని చేరుకునే మార్గాలు మూసుకుపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనిని ఉపాధ్యాయ సంఘాలన్నీ వ్యతిరేకించాయి. అయినా మెడ మీద కత్తి పెట్టి మరీ ఈ ప్రణాళిక అమలు చేయిస్తున్నారు. ఇటీవల పాఠశాలల సమయాలను పెంచడంపై కూడా ఉపాధ్యాయ సంఘాలు గుర్రుగా ఉన్నాయి.

దపో తరగతి పరీక్షలు అంటేనే జిల్లా విద్యాశాఖాధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గతంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన చరిత్ర నుంచి 2022–23 విద్యా సంవత్సరంలో 23వ స్థానం, 2023 – 24లో 25వ స్థానానికి పతనమైంది. ఈ ఏడాదైనా స్థానాన్ని మెరుగుపరుచుకునే పరిస్థితి ఉందా అంటే ప్రశ్నార్థకంగానే మారింది. ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో పాటు స్థానిక పరిస్థితులు కూడా పది ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముందంటున్నారు.

నూరు రోజుల ప్రణాళిక సత్ఫలితాలిచ్చేనా..

పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర విద్యాశాఖ నూరు రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 1 నుంచి ఫిబ్రవరి సగం వరకూ ఈ ప్రణాళిక అమలులో ఉంటుంది. ఈ ప్రణాళిక ప్రకారం 10వ తరగతి విద్యార్థులకు ప్రతీ రోజూ షెడ్యూల్ ప్రకారం నిర్వహించే తరగతులతో పాటు అదనంగా మరో రెండు తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటలకు పాఠశాలలు తెరిచే లోపు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఒక అధ్యయన తరగతి, తిరిగి పాఠశాలలు విడిచిపెట్టిన తరువాత సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ మరో అధ్యయన తరగతి నిర్వహించాల్సి ఉంటుంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయి. ఏకధాటిగా తొమ్మిది గంటల పాటు విద్యార్థులను తరగతులకు పరిమితం చేయడం వల్ల వారు మానసికంగా కుంగిపోతారని, అన్ని గంటల పాటు అభ్యసనపై దృష్టి కేంద్రీకరించలేరని చెబుతున్నారు. ఇప్పటికే రెసిడెన్షియల్ శిక్షణ పేరిట ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించిన తరగతుల కారణంగా ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనై మృతి చెందిన విషయాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావిస్తున్నారు.

పూర్తి కాని సిలబస్

ఇదిలా ఉండగా విద్యాశాఖ రూపొందించిన క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం పదో తరగతి సిలబస్ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ షెడ్యూల్ ప్రకారం జనవరి మాసాంతం వరకూ సిలబస్ చెప్పాల్సిన అవసరం ఉంది. సిలబస్ పూర్తి కాకుండా నూరు రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తే ఆచరణ ఎలా సాధ్యమంటూ ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. గతంలో కూడా ఇలాంటి ప్రత్యేక ప్రణాళిక అమలు చేసినా సిలబస్ అయిన తరువాత నుంచి మాత్రమే అమలు చేశారని గుర్తు చేస్తున్నారు.

అన్ని సబ్జెక్టుల్లో ముఖ్యమైన ప్రశ్నలు, జవాబులతో ఏటా రూపొందించే విజయకేతనం సిలబస్ బుక్‌లెట్ ఈ ఏడాది ఇప్పటి వరకూ ప్రింటింగ్ పూర్తి కాలేదు. కనీసం బుక్‌లెట్ దగ్గర ఉన్నా విద్యార్థికి పరీక్షల్లో ఎదురయ్యే ప్రశ్నలపై ఒక అవగాహన కలుగుతుందని అంటున్నారు. బుక్‌లెట్ ముద్రణ మరింత సమయం తీసుకునేలా ఉంది. విజయకేతనం బుక్ విద్యార్థి చేతిలో ఉంటే విద్యార్థిలో మనోస్థైర్యం పెరుగుతుందని, అది ఫలితాల్లో కూడా ప్రతిబింబించే అవకాశం ఉందంటున్నారు.

సెలవు దినాల్లో కూడా తరగతులా?



విద్యాశాఖ రూపొందించిన నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఆదివారాలు, సెలవు దినాలు, పండుగల్లో సైతం అధ్యయన తరగతులు నిర్వహించాలన్నారు. ఆదివారాలు, సెలవు దినాల్లో విద్యార్థులు ప్రశాంతంగా ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా గడపడానికి ఇష్టపడతారు. అలాంటి వేళల్లో విద్యార్థులను అధ్యయన తరగతులకు తీసుకురావడం కష్టం. స్థానిక పరిస్థితులకు తగ్గట్టుగా కార్యాచరణ రూపొందించుకునే వెసులుబాటు ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు కల్పించాలి.

– పువ్వుల ఆంజనేయులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు



విధి నిర్వహణలో ఇప్పటికే ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. అపార్ నమోదు, యాప్‌లలో ఫొటోలు అప్‌లోడ్ చేయడం వంటి పనులతో తలమునకలుగా ఉంటున్నారు. రెసిడెన్షియల్ శిక్షణ తరగతుల కారణంగా కొంతమంది ఉపాధ్యాయులు అనారోగ్యం పాలయ్యారు. దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమయ్యేవారు, కుటుంబంలో వృద్ధుల అవసరాలు తీర్చాల్సిన వారు ఉన్నారు. అటువంటి వారికి అదనంగా తరగతులు నిర్వహించడం కష్టసాధ్యం. దీనిపై విద్యాశాఖాధికారులు పునరాలోచించాలి.

– గెద్దం సుధీర్, వైఎస్‌ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కోడిపందేలపై దాడి



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నరసాపురం రూరల్: ఎస్పీ ఆదేశాల మేరకు నరసాపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత నవరసపురం గ్రామంలో పాలకొల్లు రూరల్, నరసాపురం రూరల్ పోలీసులు సంయుక్తంగా గురువారం రాత్రి దాడి చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 16 మందిని అదుపులోకి తీసుకున్నామని రూ.3.31లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదం, కోడి పందేలు వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక రవాణాపై రచ్చ

కొయ్యలగూడెం: ఇసుక రవాణాపై ఇరు వర్గాల మధ్య తగాదా చినికి చినికి గాలివానలా మారింది. శుక్రవారం మధ్యాహ్నం గవరవరం వద్ద ఇసుక ట్రాక్టర్ల రవాణా దారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. నల్లజర్ల మండలం సుభద్ర పాలెం వద్ద ఉన్న ఇసుక ర్యాంపునకు రానివ్వడం లేదంటూ కొయ్యలగూడెం మండలంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు ఆందోళనకు దిగారు. నల్లజర్ల మండలానికి చెందిన ఇసుక ట్రాక్టర్లను కొయ్యలగూడెం మండలంలోకి రానివ్వమంటూ వాటిని అడ్డుకున్నారు. దీంతో రెండు మండలాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లకు యజమానులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్పటికే పోతవరం మీదుగా ఇసుకతో కొయ్యలగూడెం వస్తున్న సుమారు పది ట్రాక్టర్లను నిలిపివేసి ఘర్షణకు దిగారు. తమ ట్రాక్టర్లను కూడా ఇసుక రవాణాకు అనుమతించాలని వారు వాదించారు. ఇరువర్గాలు సఖ్యతతో మెలిగితే ఇబ్బందులు ఉండవని లేని పక్షంలో నష్టపోవాల్సి ఉంటుందని మధ్యవర్తులు సూచించారు. దీంతో పోతవరంలో శనివారం చర్చించుకోనున్నట్లు తెలిపారు.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైన విద్యార్థినిలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): త్వరలో జరుగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడల్లో భాగంగా జరిగే బాస్కెట్ బాల్ పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున ఆడే జట్టు ఎంపిక పోటీలు నెల 5, 6 తేదీల్లో స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. క్రీడల ద్వారా విద్యార్థినులు తమ నైపుణ్యాలను, ప్రతిభాపాటవాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. బాస్కెట్ బాల్ టోర్నమెంట్లో విజేతలుగా సెయింట్ థెరెసా కళాశాల జట్టు నిలవగా, గోపన్నపాలెం ఎస్‌ఎస్‌ఆర్ జీసీపీఈ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రతినిధిగా ఎంవీఎస్‌ఎస్ మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులుగా బాపిరెడ్డి, వీరబాబు వ్యవహరించారు. ఈ టోర్నమెంట్లో ఎంపికైన క్రీడాకారిణులు ఈ నెల 20 నుంచి కొట్టాయంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ విమెన్ టోర్నమెంట్ నన్నయ విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహిస్తారు.

10న విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

భీమవరం: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల సందర్భంగా 10న డీఎన్నార్ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బి.రామ్ కుమార్ తెలిపారు. మూడు చక్రాల రిక్షా రేస్, జావెలిన్ త్రో, షాట్‌పుట్ పోటీలు, దృష్టి లోపం కలిగిన వారికి పరుగు పందెం, షాట్‌పుట్, క్రికెట్ (సీనియర్స్), బధిరులకు పరుగు పందెం, షాట్‌పుట్, క్యారమ్స్, మానసిక వైకల్యం కలిగిన వారికి పరుగు పందెం, సాఫ్ట్‌బాల్, డిస్కస్ త్రో తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు.

చందన బ్రదర్స్ వార్షికోత్సవాలు ప్రారంభం



ఏలూరు చందన బ్రదర్స్‌లో వినియోగదారుల సందడి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు చందన బ్రదర్స్‌లో 24వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆఫర్లతో ఎక్స్‌ప్రెస్ సేల్ పేరిట నిర్వహించిన అమ్మకాలను మొదటగా వాసవి సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో చందన బ్రదర్స్ వస్త్ర దుకాణం సరసమైన ధరలకు అన్ని రకాల వస్త్రాలను అందించడం ప్రత్యేకత అన్నారు. మేనేజర్లు జగదీష్, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నగరంలో తమ షాపులో వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు పెట్టామన్నారు. బంగారు ఆభరణాలపై వార్షికోత్సవం సందర్భంగా తక్కువ తరుగు ఉంటుందన్నారు. రెగ్యులర్ సిల్వర్ ఆర్టికల్స్‌పై తరుగు, మజూరీ లేదన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అభివృద్ధి



అల్గారిథమ్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సులో ప్రొఫెసర్లు

భీమవరం: అభివృద్ధికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దోహదం చేస్తుందని ఎన్ఐటీ రాయపూర్ సీఎస్సీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ సింగ్ పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు అల్గారిథమ్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేరిట జరిగిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రదీప్ సింగ్ మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీతో అణు విద్యుత్ కేంద్రాలు కూడా నిర్మాణం జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రతి మనిషి జీవన ప్రగతిలో ఏఐ ఎంతగానో దోహదపడుతుందన్నారు.

నిలిచిన గుండుగొలను వంతెన పనులు

- శివారు రైతుల ఆందోళనతో మళ్లీ మొదటికి
- దాళ్వా సీజన్ పూర్తయ్యే వరకు పనులు సాగని వైనం



గుండుగొలనులో వంతెన ఐరన్ ఊచలు తుప్పపడుతున్న దృశ్యం



నీటి ప్రవాహం వద్ద తూరలు అమర్చుతున్న దృశ్యం

భీమడోలు : గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వారధి నిర్మాణానికి అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సార్వా, దాళ్వాకు సాగు నీరు అవసరం లేని సమయంలో తూరలు పెట్టి పనులు చేపడతామని చెప్పి పనులు ప్రారంభించారు. ఇప్పుడు దాళ్వా సీజన్‌లో తూరలు ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి ఆటంకం పెట్టి ఆయకట్టును బీడు చేస్తారా అంటూ దెందులూరు మండలంలోని శివారు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాల్వలో తూరలు ఏర్పాటు చేయడం వల్ల నీటి ప్రవాహం తగ్గి తమ ప్రాంతంలోని 35 నుంచి 40 వేల ఎకరాల దాళ్వా పంటకు సాగునీటి కొరత ఏర్పడుతుందని, నారుమడులు వేశామని కాల్వలో నీటి ప్రవాహం తగ్గిందని శివారుకు నీరు రాకుంటే పరిస్థితి ఏంటని జలవనరుల శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని దాళ్వా సీజన్ అయ్యేంత వరకు ఉపసంహరించుకోవాలని శివారు గ్రామాలైన సత్యనారాయణపురం, పాలగూడెం, పోతునూరు, కొవ్వలి తదితర గ్రామాల రైతులు జలవనరుల శాఖ అధికారులు వద్ద ఆందోళన చేయడంతో పనులు తాత్కాలికంగా నిలిపి వేశారు.

పరిష్కారం కాని వంతెన నిర్మాణం

గుండుగొలనులో 120 ఏళ్ల కితం నిర్మించిన వంతెన రెండేళ్ల కితం కూలిపోయింది. దీంతో భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, కైకలూరు మండలాలకు చెందిన 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తీసుకు వెళ్లి బెయిలీ వంతెనను నిర్మించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. కొత్త వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లను మంజూరు చేయించారు. 50 శాతం పనులు పూర్తి చేశారు. ఇప్పటికే ఆర్‌సీసీ గడ్డర్లు సిద్ధంగా ఉన్నా సాగు నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా బిగించే పనులు నిలిచిపోయాయి. అయితే ఐరన్ ఊచలు తుప్పు పట్టిపోతున్నాయి. దీంతో నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తి కావాలంటే కాల్వ కొన్ని రోజులు పాటు మూసేస్తేనే తప్ప పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడిందని కాంట్రాక్టర్, జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల సాక్షిలో కథనం, గ్రామస్తుల ఆందోళనల నేపథ్యంలో పనుల్లో కదలిక మొదలయ్యాయి. సార్వా సీజన్ ముగియగానే కాల్వలో తూరలు ఏర్పాటు చేసి వంతెన నిర్మిస్తామని కొన్ని రోజులు అధికారులు నిర్ణయించారు. ఆందోళనతో పనులు మొదటికి వచ్చాయి.

కాల్వ పరిధిలోని దెందులూరు మండలం, భీమడోలు మండలాలకు చెందిన రైతులు, పెద్దలకు అధికారులు తెలియజేసి వారి అభిప్రాయాలను తెలుసుకుంటే సమస్య ఇంత వరకు వచ్చేది కాదని పలువురు అంటున్నారు. సార్వా సాగు ముగియగానే గడ్డర్లు ఏర్పాటు చేసుకునేలా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో మూడు మీటర్ల గల 20 ఐరన్ తూరలు తీసుకు వచ్చారు. భారీ క్రేన్‌లతో పనులు చేపట్టారు. రైతుల ఆందోళనతో పనులు నిలిచిపోయాయి.

బెయిలీ వంతెనపై భయం భయంగా ప్రయాణం

బెయిలీ వంతెన ప్రారంభోత్సవంలో కాల పరిధి రెండేళ్లే అని తెలిపారు. గడువు తీరింది. అధిక లోడు వాహనాల రాకపోకలు సాగించడంతో రేకుల నట్లు ఊడి బ్రిడ్జి బలహీన పడుతుంది. దీంతో వంతెనపై ప్రయాణం భయం భయంగా సాగుతుంది. రేకులు పాడైతే స్థానిక ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు వాటికి మరమ్మతులు చేయించారు. వంతెన నిర్మించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

వంతెన పనులు నిలిపివేయడం బాధాకరం



తూరలు ఏర్పాటు పనులను నిలిపివేయడం బాధకరం. కొన్ని రోజుల్లో ఈ సమస్య పరిష్కారమవుతుందని అందరూ భావిస్తున్న తరుణంలో పనులు ఆపారు. వంతెన నిర్మాణం అలస్యమవడంతో ఎందరో రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. జలవనరుల శాఖ అధికారులు శివారు రైతులకు నీటి ప్రవాహనికి ఎటువంటి ఇబ్బంది ఉండదని రైతులకు చెప్పి వారిని ఒప్పిస్తే బాగుండేది.

– కత్రి గంగాధరావు, గ్రామస్తుడు, గుండుగొలను

కొబ్బరి బొండాలకు కొత్త మెషీన్



కొబ్బరి బొండాలు నరకాలంటే ఒకప్పుడు కత్తి వాడేవారు. అలవాటయితే తప్ప కొత్త వారికి కొబ్బరి బొండం కొట్టడం కష్టంగా ఉండేది. అయితే ఇప్పుడు బొండాలు కొట్టే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామాల్లో కొబ్బరి బొండాల్ని యంత్రంతో నరికి దానికి రంధ్రం పెట్టి ఇస్తున్నారు. గ్రామాల్లో అందుబాటులోనికి వచ్చిన ఈ యంత్రాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. కొబ్బరి బొండం నరికే మెషీన్ వీరవాసరం మండలం పంజా వేమవరంలో దర్శనమిచ్చింది.

– భీమవరం

బైక్ దొంగ అరెస్ట్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు

పాలకోడేరు : గురువారం సాయంత్రం కోరుకొల్లు శ్మశాన వాటిక సమీపంలో ఉన్న ఖాళీ స్థలం వద్దకు సిబ్బందితో వెళ్ళగా జీగా తేజ (19) అనే యువకుడు వివిధ చోట్ల చోరీ చేసిన బైక్‌లతో పట్టుబడ్డాడని పాలకోడేరు ఎస్సై మంతెన రవివర్మ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అతని నుంచి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ 5.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

బంధన్ బ్యాంకులో గోల్‌మాల్

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలోని బంధన్ బ్యాంకు రుణాల సొమ్మును బ్యాంకు మేనేజరు, సిబ్బంది కాజేసారంటూ ఖాతాదారుల ఆందోళనతో బ్యాంకు వద్ద శుక్రవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం బ్యాంకు వద్దకు చేరుకుని మేనేజరు శివ, సిబ్బందిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం బ్యాంకు ద్వారా రుణాలు పొందిన ఖాతాదారులకు పూర్తి సొమ్ములు ఇవ్వకుండా నెలల తరబడి బ్యాంకు చుట్టూ తిప్పుతున్నారని ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. కొంతమంది రుణగ్రస్తులకు రుణ సొమ్ములు అందించకుండానే రుణాల బకాయిలను చెల్లించాలంటూ వాయిదాలు వసూలు చేశారు. దీంతో ఖాతాదారులు తమకు రుణాలు ఇవ్వకుండా రుణ వాయిదాలను చెల్లించాలని ఇళ్లకు వచ్చి హడావుడి చేయడంతో ఖాతాదారులు శుక్రవారం రాత్రి బ్యాంకు మేనేజరును నిలదీశారు. ఖాతాదారులు ఆందోళనకు దిగారు. బ్యాంకు మేనేజరు, సిబ్బందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాని, పూర్తి వివరాల అనంతరం ఖాతాదారులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

కిశోర వికాసంపై శిక్షణ



తాడేపల్లిగూడెం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం కిశోర వికాసంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ బాలికలను ఉన్నత విద్యావంతులను చేయాలన్నారు. తద్వారా కుటుంబం విద్యాపరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే బాలికలకు 18 ఏళ్ల నిండకుండా వివాహాలు చేయరాదని సూచించారు. యుక్త వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. ఎంఈవోలు వి.హనుమ, పీఎంకే. జ్యోతి మాట్లాడుతూ బాలికలకు సంతులిత ఆహారం అందించాలని, తద్వారా రక్తహీనత లేకుండా ఉంటుందన్నారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయకృష్ణ, న్యాయవాది కంకట శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.ఎస్తేరు రాణి, జి.బేబి, సీహెచ్‌వో సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవ ప్రచారాలు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : ఉపముఖ్యమంత్రిగా, దేవదాయ శాఖ మంత్రిగా అధికారంలో ఉన్న కొట్టు సత్యనారాయణ వెంట ఉండి ఇప్పుడు పార్టీలోనే మరో వర్గాన్ని ఏర్పాటు చేసుకొని అవాస్తవాలను ప్రచారం చేయడం జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులుకు తగదని మాజీ ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్ హితవు పలికారు. ఇటీవల తాడేపల్లిగూడెం మండలంలోని ఒక ఎంపీటీసీ విషయంలో ఎన్నికలకు సంబంధించి వచ్చిన వివాదాన్ని మాజీ మంత్రి కొట్టు దృష్టికి తీసుకురాగా ఆమెకు న్యాయం చేయాలని చెప్పారన్నారు. ఆ మహిళకు న్యాయం చేయకుండా ఇప్పుడు మాజీ మంత్రి కొట్టు వర్గంపై అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈవిషయంపై పార్టీ నాయకులు బంగారు నాగు, వెలిశెట్టి నరేంద్ర, చిటికెన ప్రసాద్, సూరంపూడి రామకృష్ణ మాట్లాడారు. కర్రి భాస్కరరావు, గుండుమోగుల సాంబయ్య, రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ప్రమోదకుమారి

అత్తిలి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఎంచుకున్న జీవితలక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని తణుకు ఐసీడీఎస్ సీడీపీఓ పి ప్రమోదకుమారి చెప్పారు. శుక్రవారం అత్తిలి మండలం మంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ప్రమోదకుమారి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. మంచిలి సెక్టార్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి మాట్లాడుతూ బాలల హక్కులు తెలుసుకుని వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఎం వెంకటరమణ, తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి, డీసీపీయు యూనిట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి మమతాశ్రీ, పి జేమ్స్, పి వెంకటేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు కోరారు. పట్టణ ఆరోగ్య కేంద్రం యాగర్లపల్లి పరిధిలోని 14, 19, 24 వార్డులలో హెల్త్ సిబ్బందిచే శుక్రవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికడదామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ప్రశాంతి, జయభారతి, వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త కనకదుర్గ, ఆశాలు, ఆరోగ్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపాలి

తణుకు టౌన్: విద్యార్థులకు విద్యతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని తణుకు బెల్ వెదర్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ ఏ దీపక్ కుమార్ చెప్పారు. శుక్రవారం తణుకులోని బెల్ వెదర్ స్కూల్ ఆవరణలో రాక్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ క్రీడలు, సాహస కృత్యాలలో పాల్గొన్నారు.

యంత్రం.. సాగు మంత్రం

- వరిసాగులో జోరుగా యంత్రాల వినియోగం
- ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కూలీలు



యంత్రం సాయంతో వరి కోతలు చేస్తున్న దృశ్యం

ఇరగవరం: వరిసాగులో రైతులు కొత్త కొత్త వంగడాలు వినియోగించడంతోపాటు వినూత్న రీతిలో పంట సాగుకు శ్రీకారం చుడుతున్నారు. దీనిలో భాగంగానే యంత్రాల వినియోగం ఏటేటా పెరుగుతూ వస్తోంది. రైతుల ఆలోచనకు తగ్గట్లుగా యంత్రాలుకూడా మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. చిన్న సన్నకారు రైతులు మినహా మిగిలిన రైతులు యంత్రాలను కొనుగోలు చేసి వరిసాగులో జోరుగా వాటిని వినియోగిస్తున్నారు. అయితే వారి అడుగ జాడల్లోనే చిన్న, సన్నకారు రైతులు కూడా నడుస్తూ యంత్రాలను అద్దెకు తీసుకుంటూ సాగు చేస్తున్నారు. వరిసాగు ప్రారంభంలో ట్రాక్టర్లతో దమ్ములు చేయడంతో పాటు వరినాట్లు వేయడంలోనూ యంత్రాలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వరి కోతల సమయం కావడంతో యంత్రాల సాయంతో వరి కోతలను జోరుగా చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యం రాత్రింబవళ్లు పొలాల్లో బిజీబిజీగా గడుపుతూ యంత్రాల సాయంతో నూర్పులు చేపడుతున్నారు.

వినియోగంపై ఆసక్తి

సకాలంలో వర్షాలు, సాగునీరు లేకపోవడంతో పంట రాబడి ఆలస్యం అవుతుందని భావించి యంత్రాలను ఉపయోగిస్తున్నారు. అలాగే తక్కువ సమయంలో ఎక్కువ పని సాధ్యమవుతుందని, అలాగే పెట్టుబడి కూడా తగ్గుతుందని భావించి యంత్రాలపై ఆసక్తి చూపుతున్నారు. ఎకరం పంట పొలంలో సాగు చేసేందుకు కూలీలను ఉపయోగిస్తే సుమారు రూ.12 నుంచి రూ.15వేలు ఖర్చు అవుతుంది. అదే యంత్రాలను ఉపయోగించి సాగు చేస్తే కేవలం రూ.5వేల నుంచి రూ.7వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరం వరి కోతకు కూలీలకు అయ్యే ఖర్చు రూ.5,500లు కాగా, అదే యంత్రం సాయంతో కోత చేస్తే రూ.2,400లు ఖర్చు అవుతుంది. అలాగే యంత్రం సాయంతో కోత, నూర్పు చేస్తే ఏళ్ల తరబడి వ్యవసాయ పనులను నమ్ముకొని జీవనోపాధి సాగిస్తున్న వ్యవసాయ కూలీలకు యంత్ర వినియోగం ఉపాధిని దూరం చేసింది. గతంలో వ్యవసాయ కూలీలపై ఆధారపడి పంట సాగు చేసే రైతులు, నేడు యంత్రాల మీద ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. దీంతోవ్యవసాయ కూలీలు స్థానికంగా ఉపాధి లేక దిక్కుతోచక వలస బాట పడుతున్నారు. కొంతమంది కూలీలు ప్రత్యామ్నాయ పనులను చూసుకుంటూ ఉపాధి సాగిస్తున్నారు. అయితే ఈ యంత్రాల వినియోగం కూలీలకు ఉపాధి దూరం చేసినా, రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గిస్తూ ఆదాయం కలిసి వస్తోందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

సులువుగా, వేగంగా



యంత్రాల సాయంతో పంటలు సాగు చేస్తే పని సులువుగా, వేగంగా పూర్తవుతుంది. అలాగే తక్కువ సమయంతో పాటు పెట్టుబడి తక్కువ అవుతోంది. దీంతో మాకు కొంత పెట్టుబడి మిగులుతుంది. ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో యంత్రంతోనే కోతలు చేస్తున్నాం

– మంగిన రామానాయుడు, ఇరగవరం రైతు

పెట్టుబడి తగ్గుతోంది



ప్రస్తుతం వరి కోతలను యంత్రాల సాయంతో చేస్తున్నాం. వరికోత యంత్రం ఉపయోగించడం వలన తక్కువ ఖర్చుతో అనుకున్న సమయానికి పని పూర్తవుతోంది. ఎకరం కోత, నూర్పు చేయడానికి రూ.3,600 ఖర్చు అవుతుంది. అదే కూలీలను పెట్టి కోతలు చేస్తే రూ.5వేలు వరకు ఖర్చు అవుతుంది.

– వానపల్లి గణపతి, కోత మిషన్ నిర్వాహకుడు

శిలాఫలకం తీసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంలో గత 40 సంవత్సరాల క్రితం మునిసిపల్ మాజీ చైర్మన్ ఈలి సత్యనారాయణచే ఎస్సీ, కార్పొరేషన్ షాపుల సముదాయానికి శంకుస్థాపన చేశారని, శంకుస్థాపన శిలాఫలకం కొంత మంది దుష్టశక్తులు తీసివేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు, ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నాయకులు చీకటిమిల్లి మంగరాజు, దర్శి చంద్రశేఖర్, ఎం.నాగరాజు, సుజన్, ఫ్రాన్సిస్, ఆనందరావు, దావీదు, మరపట్ల రాజు, శీలి వెంకటేశ్వరరావు, గుంపుల సత్యకృష్ణ, ఎలీషా, రమేష్ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ, తణుకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను శనివారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వి.హైమావతి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా సుబ్బారాయుడు కల్యాణోత్సవాలు



మాజీ మంత్రి కారుమూరినాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును సత్కరిస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి షష్ఠి మహోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీస్వామివారి కల్యాణోత్సవాలు ఈనెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాలు సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం స్వామివారి కళావేదికపై పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ముఖద్వారం నుంచి ఆలయం వరకు గల ప్రధాన మార్గాలలో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఈసందర్భంగా శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వీరికి ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కురెళ్ల ఉమామహేశ్వరరావు, కల్యాణ మండప కమిటీ అధ్యక్షుడు కూనపరెడ్డి జయరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు శుక్రవారం రాత్రి పట్టణంలో పలుప్రాంతాలు పాతూరు, కడకట్ల, గణేష్‌నగర్, నందిబొమ్మ రామాలయం, వాసవి ఆలయం తదితర ప్రాంతాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పురాతన పాతూరు శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి వారి ఆలయంలో ధర్మకర్త కర్రి సీతారామయ్య ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణేష్ నగర్‌లోని శ్రీ సిద్ధి వినాయక వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆలయ సేవా సమితి అధ్యక్షుడు కల్యాణం రామచంద్రరావు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం జరిగింది. నందిబొమ్మ సెంటర్‌లోని విఘ్నేశ్వర రామాలయంలో స్వామి కల్యాణంగా ఘనంగా నిర్వహించారు.

ఘనంగా షష్ఠి వేడుకలు ప్రారంభం

పెంటపాడు: మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పడమరవిప్పర్రు గ్రామంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. పసల కుటుంబీకులు స్వామివారి కల్యాణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొడవటిగంటి వేంకట నరసింహాచార్యుల బ్రహ్మత్వంలో కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారపరిషత్ నాయకురాలు కొండ్రెడ్డి హైమావతి, గ్రామస్తులు కల్యాణంలో పాల్గొన్నారు. పెంటపాడు పెద్దశివాలయం వద్ద ఆలయకమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం నిర్వహించారు.



పాతూరులో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పడమరవిప్పర్రు గ్రామంలో కల్యాణమూర్తిగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

తణుకు అర్బన్: తణుకు కోర్టు పరిధిలోని 7 మండలాల నుంచి పారా లీగల్ వలంటీర్లు (న్యాయసేవా సహాయకులు)గా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర న్యాయసేవల సంస్థ, ఏలూరు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వివరించారు. రిటైర్డు ఉపాధ్యాయులు, లెక్చరర్స్, సీనియర్ సిటిజన్స్, సోషల్ వర్క్ స్టూడెంట్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, న్యాయ విద్య అభ్యసించే విద్యార్థులు, ఎన్జీవోస్, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు పారా వలంటీర్లుగా దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటా, విద్యార్హత, జెరాక్స్ కాపీలను జతచేసి దరఖాస్తుతోపాటుగా తణుకు కోర్టులో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు ల్యాండ్‌లైన్ నంబరు 08819 241133, న్యాయసేవల కమిటీ సిబ్బంది నంబరు 97041 27956, 93812 87708లో సంప్రదించాలని కోరారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకూ భువనేశ్వర్ జరిగే సౌత్ జోన్ యోగా పోటీలకు తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినీలు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి తెలిపారు. ఈనెల 5వ తేదీన రాజమండ్రి ఆది కవి నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన సౌత్ జోన్‌యోగా ఎంపిక పోటీలలో తమ కళాశాలకు చెందిన బీ భవానీ ప్రసన్న, బీ నాగలక్ష్మీ దుర్గ, కె జ్యోతి, ఏ సౌమ్య నాగవల్లీలు విజేతలుగా నిలిచి భువనేశ్వర్‌లో జరిగే సౌత్ జోన్ యోగా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినీలను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, యోగా ఇన్‌స్ట్రక్టర్ జీ అన్నపూర్ణ, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శం



తణుకు అర్బన్: బార్ అసోసియేషన్ భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



తాడేపల్లిగూడెం అర్బన్: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలని పోరాటం చేసిన మహానేత అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.అంబేడ్కర్, ఈదా రామకృష్ణ, ఎం.శాంసన్, పొట్ల విజయ్, సీహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు స్థానిక ఎన్టీఆర్ పార్కు ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, నాయకులు బొద్దాని మురళికృష్ణ, నూనె రాధాకృష్ణ, నోడగల అప్పారావు, కొమరాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌ఇండియా పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

దేశానికి అత్యున్నత రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని ఆల్ ఇండియా పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, న్యాయవాది పొట్ల సురేష్ అన్నారు. తణుకులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విద్యార్థులు పాల్గొన్నారు. తణుకు మునిసిపల్ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా డీఈఈ బీవీ రామకృష్ణ, అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.



తణుకు టౌన్: డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం (టీఓసీ): అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంగరాజు



తాడేపల్లిగూడెం: ఉద్యానవర్సిటీలో అంబేడ్కర్ వర్ధంతిలో వీసీ గోపాల్



పెంటపాడు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సమానత్వ సాధనకు అంబేడ్కర్ కృషి మరువలేం

తణుకు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాణం ద్వారా దేశంలో సామాజిక సమానత్వ సాధనకు బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి మరువలేమని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్ చెప్పారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహా పరి నిర్వాన్ దినంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కూటమి నాయకులతో కలసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముద్దాపురంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దువ్వ గ్రామంలో ఎంపీపీ రుద్రా ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండపాకలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, ఇతర నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తేతలి గ్రామంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, వైస్ ఎంపీపీ గారపాటి పద్మజ, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, ఇతర నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

తాడేపల్లిగూడెం అర్బన్ : బడుగు బలహీన వర్గాలకు ఆరాధ్యుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండుమోగుల సాంబయ్య, కర్రి భాస్కరరావు, వెలనాటి సత్తిబాబు, రంగబాబు, సూరంపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కృషి అజరామరం

తాడేపల్లిగూడెం: అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారని ఉద్యానవర్సిటీలో శుక్రవారం జరిగిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఉపకులపతి కె.గోపాల్ తెలిపారు. అంబేడ్కర్ సామాజికవేత్త కాదు, మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖా మంత్రి, రాజ్యాంగ శిల్పి అని ఆయన జీవిత చరిత్ర అందరూ తెలుసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. నన్నయ్య విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ ఆదర్శాలను అందరూ అనుసరించాలన్నారు. ప్రిన్సిపాల్ టి.అశోక్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

పెంటపాడు: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం మండలంలో పలు ప్రాంతాల్లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. అధ్యాపకులు జాన్‌బాబు, ప్రేమ్‌సాగర్, వాణి, గోపాల్ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు. పెంటపాడు బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి విశ్రాంత బ్యాంక్ మేనేజర్, మానవత ఉమ్మడి జిల్లా నాయకులు తాడేపల్లి మోహనరావు తదితరులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. పోస్ట్‌బేసిక్ స్కూలు ఉపాధ్యాయులు శశికపూర్, జైభీమ్ కార్యవర్గ సభ్యులు పోలుమాటి జయరాజు, ఇసుకపాటి మధుసూదనరావు, విప్పర్తి వినాయకుడు,గడ్డం అచ్చిబాబు, చిగురుపాటి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, సుజన, నాగరాజు, మరపట్ల రాజు, గుంపుల సత్యకృష్ణ, శేఖర్, దావీదు పాల్గొన్నారు. అలాగే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జై భీమ్ యూత్ పిలుపునిచ్చారు.